క్లుప్తంగా

సేవలోనే ఆత్మ సంతృప్తి



కుర్చీలను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

గోస్పాడు: సేవచేయడంలోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, సెక్రటరీ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దీబగుంట్ల హైస్కూలుకు రోటరీ క్లబ్ సభ్యులు కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పేద విద్యార్థులు వస్తుంటారని వారిని దృష్టిలో ఉంచుకొని తమ వంతు సహకారంగా కుర్చీలను విరాళంగా అందజేశామన్నారు. హెచ్‌ఎం నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు రోటరీ క్లబ్ వారు కుర్చీలను విరాళంగా అందించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బయ్య, పీడీ విశ్వనాథ్, అనిత, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు కల్పించిన జీతాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల భవనాలను త్వరగా నిర్మించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆల్ మేవా సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో లా కాలేజీ, కేంద్రీయ విద్యాలయం, ఉర్దూ కళాశాలకు సంబంధించిన భవనాలను త్వరగా నిర్మించాలని ఆల్ మేవా నాయకులు అబులైజ్, జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా కోరారు. శుక్రవారం ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యారు. అక్కడ ఆల్‌మేవా నాయకులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉర్దూ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌లను నియమించాలని కోరారు. 125 మంది బాలికలు చదువుతున్నారని, భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల (వ్యవసాయం): మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన ఆకతాయికి శుక్రవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించారు. నంద్యాలలోని భీమవరం చౌరస్తా వద్ద రజక లింగమయ్య దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా 3 రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి విజ్ఞాన మేళా



విజ్ఞాన మేళా కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి సమితి స్థాయి గణిత విజ్ఞాన మేళా ఈనెల 14, 15 తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు శ్రీ శారదా విద్యాపీఠం ఉన్నత పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, అనంతపురం సమితి అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం విద్యాభారతి ఆధ్వర్యంలో నంద్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 23 వేల పాఠశాలల్లో విజ్ఞాన మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హిమనాథ్, డాక్టర్ ఉదయ్‌శంకర్, పాఠశాల కార్యదర్శి చెన్నకేశవులు, ప్రధాన చార్యులు వెంకటకృష్ణయ్య, నాగరాజు, సందీప్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై శ్రీకాకుళంకు చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. మహాగణపతిం, శివతాండవం, శివశివశంకర, ఆనందతాండవం, శివపంచాక్షరీస్తోత్రం గీతాలకు నృత్యప్రదర్శన చేశారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి



మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులపై భారం పడుతుంది. రూ.లక్షలు వెచ్చించి గ్రామీణం ప్రాంత విద్యార్థులు చదవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం పేదలు, రైతులు తమ పిల్లలను వైద్య కోర్సు చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్ కాలేజీలు ప్రైవేట్‌పరమయితే వారి కలలు నెరవేరవు. ఈ విషయంలో ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– భూమా చెంచిరెడ్డి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, చాకరాజువేముల



విద్యార్థుల జీవితాలతో చెలగాటం



గత ప్రభుత్వంలో అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయి. పెరిగిన సీట్లతో వైద్య విద్యపై ఆసక్తితో గత రెండేళ్ల నుంచి కొందరు విద్యార్థులు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు. ఎలాగైనా డాక్టర్ అయి పేదలకు సేవ చేయాలని కలలు కంటున్నారు. ఈక్రమంలో అనుమతుల పేరుతో ప్రభుత్వం కొత్త కళాశాలల్లో సీట్ల భర్తీకి కొర్రి పెట్టారు. ఇలా చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమవుతుంది. ప్రైవేట్‌లో వైద్య విద్య అభ్యసించాలంటే చాలా భారమవుతుంది.

–ఫణీంద్రనాథ్ , సీనియర్ న్యాయవాది,నంద్యాల

చాకిరేవు కష్టాలు

- ధోబీ ఘాట్లు లేక అవస్థలు పడుతున్న రజకులు
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు
- భారంగా మారిన జీవనం



శిరివెళ్ల కుంటలో బట్టలు ఉతుకుతున్న రజకులు

శిరివెళ్ల: ఏళ్లు గడుస్తున్నా రజకుల కష్టాలు తీరడం లేదు. జీవనాధారమైన కుల వృత్తిని కొనసాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. గ్రామాల్లో ధోబీఘాట్లు లేకపోవడంతో ప్రమాదకరంగా వంకలు, వాగుల వద్ద బట్టలు ఉతకాల్సిన దుస్థితి. మండల కేంద్రంలో దాదాపు 75 కుటుంబాలు, యర్రగుంట్ల 55, గోవిందపల్లె 52 కుటుంబాలు, కోటపాడులో 25 కుటుంబాలు, కామినేనిపల్లెలో 10 కుటుంబాలు, బోయలకుంట్ల 20, గుంప్రమాన్‌దిన్నె 15, గుండంపాడులో 25 కుటుంబాలు కుల వృత్తిపై ఆధారపడి ఉన్నాయి. వీరంతా గ్రామాల సమీపంలో ఉన్న వంకలు, వాగులు వద్దకు పోయి బట్టలు ఉతుకుతున్నారు. మండల కేంద్రంలో ఆది నుంచి కోడిపిల్ల వాగు వద్ద బట్టలు ఉతికే వారు. పంచాయతీ సిబ్బంది కక్కసు వేయడం మొదలు పెట్టడంతో రజకులకు కష్టాలు మొదలయ్యాయి. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని వారు నిరసన తెలపడమే కాకుండా తహసీల్దార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. అయినా, ఎలాంటి ఫలితం లేదు. ప్రస్తుతం ఆనకట్ట కుంట, ఎంపీడీఓ కార్యాలయ పిల్ల కాల్వలో బట్టలు ఉతుకుతున్నారు. పాలకులు, అధికారులకు ధోబీ ఘాట్లు కావాలని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. పలు చోట్ల ఉతికిన బట్టలు ఆరవేయటానికి కూడా స్థలం లేదు. గోవిందపల్లెలో తెలుగు గంగ కాల్వ, కుంట వద్ద బట్టలు ఉతుకుతున్నారు. గోవిందపల్లెలో వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తుతుంటుంది. నీరు లేక ప్రజల ఇళ్ల వద్దనే బట్టలు ఉతుకుతారు. బోరు వేస్తే సమస్య తీరుతుందని రజకులు అంటున్నారు. కోటపాడులో కేసీ కెనాల్ ఉప కాల్వలో రజకులు బట్టలు ఉతుకుతున్నారు.



స్థలం లేక పొలంలో దుస్తులు ఆరబెడుతున్న దృశ్యం

ధోబీ ఘాట్లు కట్టాలి



మా గ్రామంలో 65 కుటుంబాలున్నాయి. బట్టలు ఉతకడానికి ఇబ్బందిగా ఉంది. వక్కిలేరు వాగు, కుంటలు, కాల్వల వద్ద బట్టలు ఉతుకున్నాము. స్థలం లేక పోవటంతో బట్టలు ఆరేసుకోవడానికి కష్టంగా ఉంది.ఎండా కాలంలో వాగులు, వంకలు ఎండిపోతాయి. అప్పుడు బట్టలు ఉతకడానికి మరింత కష్టమే. దోభీ ఘాట్లు కడితే కష్టాలు తీరుతాయి. మా జీవనాధారానికి ఇబ్బంది ఉండదు.

–హరిబాబు, శిరివెళ్ల

ఎండా కాలంలో నీటి సమస్య



ఎండా కాలం వస్తే కాల్వలు, కుంటల్లో నీళ్లు ఉండవు. అప్పుడు బట్టలు ఉతకడానికి ఇబ్బందిగా ఉంటుంది. ధోబీ ఘాట్లు మా గ్రామంలో అస్సలు లేవు. పెద్ద కాల్వలకు పోయి మేము బట్టలు ఉతుకుతుంటాము. మా గ్రామంలో 20 కుటుంబాలు చాకిరిపై ఆధారపడ్డాయి. ప్రభుత్వం మాకు దోభీ ఘాట్లతో పాటు ఎండాకాలంలో నీటి సమస్యతో ఇబ్బంది పడకుండా బోర్లు వేయించాలి.

– ఈశ్వరయ్య కోటపాడు

చిరుద్యోగులను తొలగిస్తే ఊరుకోం

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులను దొడ్డిదారిన తొలగించేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే, నాయకులు చెబుతున్నారని అధికారులు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని. చూడటం సరికాదన్నారు.పాత వారిని తొలగించి, కొత్తవారిని ఎంపిక చేయాలంటే ఆయా గ్రామ పంచాయతీ పాలక మండలి తీర్మానం అవసరమన్నారు. ఈ నిబంధన పాటించకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించి తమ అనుకూలమైన వారికి ఉద్యోగం ఇస్తామంటే కుదరదన్నారు. పొదుపు సంఘాల బుక్ కీపర్లు, ఐక్య సంఘాల లీడర్లను సైతం తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దీనికి కూడా ఐక్యం సంఘాల సభ్యుల తీర్మానం తప్పని సరి అనే విషయం మరచిపోరాదన్నారు. తమకు ఇవేవి పట్టవంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. అప్పుడు చట్టప్రకారం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చిరుద్యోగులు ధైర్యంగా ఉండాలని.. అన్ని విధాలుగా అండగా నిలబడుతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు.

పకడ్బందీగా స్వచ్ఛతాహీ సేవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీ మహేంద్రారెడ్డి, ఏపీఓ రవిప్రకాష్‌లతో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా భాగీదారీ సంపూర్ణ స్వచ్ఛతా, సఫాయి మిత్ర సురక్ష, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

నంద్యాల(అర్బన్): ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు మండలంలో స్వచ్ఛతా హీ–సేవా కార్యక్రమాల నిర్వహణకు పంచాయతీల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. పోలూరుకు బ్రహ్మంనాయక్, మునగాలకు ఆరోగ్యమ్మ, రాయమాల్పురం శివశంకర్, పులిమద్ది రాంప్రసాద్, చాపిరేవుల మురళీకృష్ణనాయక్, పాండురంగాపురం మల్లేశ్వరి, పుసులూరు ప్రసాద్‌రావు, బ్రాహ్మణపల్లె రాజారఘువర్మ, మిట్నాల శ్రీధర్, గుంతనాల గుర్రప్పడు, అయ్యలూరు, కానాల వెంకటేశ్వరరావు,కొత్తపల్లె, చాబోలు సుగుణశ్రీ, పెద్దకొట్టాల శ్రీనివాసరెడ్డి, బిల్లలాపురం విజయలక్ష్మి, బీమవరం శ్రీకళ లను నియమించినట్లు తెలిపారు. కేటాయించిన పంచాయతీల్లో షెడ్యూలు ప్రకారం స్వచ్ఛతా హీ–సేవా కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు.

నంద్యాలలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలకు హైకోర్టు బెంచి ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర న్యాయశాఖామంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం న్యాయవాదులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల కోర్టు కాంప్లెక్స్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కావాలిసిన అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. తనవంతుగా హైకోర్టు బెంచ్ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. త్వరలో చీఫ్ జస్టిస్‌ను కలిసి సీనియర్, జూనియర్ న్యాయవాదుల సమస్యలు, వివిధ కోర్టుల భవనాల నిర్మాణాల విషయాన్ని వివరిస్తానన్నారు. 60 ఏళ్లు దాటిన సీనియర్ న్యాయవాదులకు పెన్షన్, ఆరోగ్య భీమా, అర్హత కలిగిన వారికి ఇంటిస్థలాలు ఇప్పిస్తామన్నారు. అనంతరం మంత్రిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు దుర్గప్రసాద్, వెంకటేశ్వర్లు, రామచంద్రారావు, తులిసిరెడ్డి, మద్దిలేటిస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారును అభివృద్ధి చేయండి

నంద్యాల(రూరల్): పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ఉన్న రైతుబజార్ పశువుల పాకల కంటే దయనీయ స్థితిలో ఉందని, దానిని అభివృద్ధి చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాలి రవిరాజ్ కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆయన రైతు బజార్‌ను సందర్శించారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ

దొర్నిపాడు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు బాలింతలు క్రమం తప్పకుండా పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలన్నారు. దీనివల్ల రక్తహీనతను నివారించ వచ్చన్నారు. వెలుగు ఏపీఎం బాబు, మహిళా పోలీసు రజితారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్‌కు మరో రెండు రోజులే!

- ఈనెల 15తో ముగియనున్న గడువు
- ప్రభుత్వ పథకాలకు ఈ క్రాప్ నమోదు కీలకం



ఈ–క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: రైతులు పంట నష్టం, మద్దతు ధర తదితరవి పొందాలంటే ఈ–క్రాప్ నమోదు చాలా కీలకం. అయితే, ఈ ప్రక్రియ క్షేత్ర స్థాయిలో వేగంగా జరగడం లేదు. వ్యవసాయ అధికారులు మాత్రం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేసకోవాలంటే రెండు రోజులు మాత్రమే సమయం ఉందని చెబుతున్నారు. ఈనెల 15న చివరి తేదీగా రైతులు త్వరపడాలని సూచిస్తున్నారు. వ్యవసాయ ప్రణాళిక, రుణ ప్రణాళిక, ధాన్యం, మొక్కజొన్న, పత్తి, మినుము, మిరప, కంది, తదితర వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు, పంటనష్టం తాలూకా, పెట్టుబడి రాయితీ అందజేత, పంటల బీమా, రాయితీలు, పరిహారం చెల్లింపునకు ఈ–క్రాప్ నమోదు అవసరం. దీంతో పాటు రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

దొర్నిపాడు మండలంలో గ్రామాల వారీగా పంట నమోదు వివరాలు

గ్రామం	ఈ-క్రాప్ నమోదు(హెక్టార్లలో)	
	ఇప్పటి వరకు	చేయాల్సినది
గుండుపాపల	633	28.08
డబ్ల్యూ గోవిందిన్నె	713	39.58
డబ్ల్యూ కొత్తపల్లె	1887	41.992
చాకరాజువేముల	1699	113.36
బుర్రారెడ్డిపల్లె	200	140.79
అర్జునాపురం	469	59.30
కొండాపురం	464	48.77
రామచంద్రాపురం	523	12.48
దొర్నిపాడు-1	1480	62.85
దొర్నిపాడు-2	631	62.85
క్రిష్టిపాడు	631	97.74

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డీ1, డీ2, డీ3 సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు నాగరాజు, రామయ్య, రవికుమార్ శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనుల వల్ల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ప్రారంభం



కబడ్డీ ఆడుతున్న బాలికలు

దొర్నిపాడు: స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జయలక్ష్మి ఈ పోటీలను ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీల్లో బాలబాలికలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయిలో మంచి ప్రతిభ చూపి తాలూకా స్థాయికి చేరాలని విద్యాకమిటీ చైర్మన్ ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు దేవేంద్ర, శ్రీధర్, బాలకృష్ణ, సరళ పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరనిలోటు



సంతాపం తెలుపుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): సీపీఎం నేత సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లనరసింహ, తోట మద్దు మాట్లాడుతూ 12 సంవత్సరాల పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ పార్లమెంటరీ అంశాలపై లోతైన విశ్లేషణలు చేస్తూ ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇచ్చేవారన్నారు. ప్రజల తరపున వివిధ అంశాలపై పోరాటాలు చేసి వారి మన్ననలు పొందారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, వెంకటలింగం, రామరాజు, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నంద్యాల పట్టణంలో సీపీఐ నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేఖ విధానాలపై ముందుండి పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రంగనాయుడు, బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

పేరూరులో మాన్యం భూముల కౌలుకు వేలం



కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరులో శుక్రవారం దేవదాయశాఖ అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య మాన్యం భూముల కౌలుకు వేలం నిర్వహించారు. ఈ భూములను దక్కించుకునేందుకు రైతులు పోటీ పడటంతో ఆలయానికి గతేడాది కంటే అధిక ఆదాయం వచ్చింది. మండలంలోని ఈశ్వర, రామాంజనేయ స్వామి వారి ఆలయానికి సంబంధించి దాదాపు 70 ఎకరాల మాన్యం ఉంది. ఈ భూములకు దేవదాయ శాఖ అధికారులు ఈ ఏడాది జూన్ 25న కౌలు వేలం నిర్వహిస్తుండగా రైతుల మధ్య వాగ్వాదం జరగడంతో అధికారలు కౌలు వేలాన్ని వాయిదా వేశారు. తిరిగి ఆ భూములకు శుక్రవారం ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, రుద్రవరం పోలీసులతో పాటు ప్రత్యేక బలగాల మధ్య ఈఓలు నర్సయ్య, చంద్రుడు,సాయి జయచంద్రారెడ్డి కౌలు వేలం చేపట్టారు. ఈ సారి ప్రశాంతంగా జరగడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కౌలు వేలం పాట ద్వారా గతేడాది రూ.6.15 లక్షలు రాగా ఈ ఏడాది రూ.7.31లక్షలు వచ్చిందని ఈఓలు తెలిపారు.

పరిశుభ్రతతో అతిసార నియంత్రణ



సద్దాం కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

ఆళ్లగడ్డ: పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతో అతిసారను అరికట్టవచ్చని నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, మునిసిపల్ ఆర్‌జేడీ మూర్తి అన్నారు. పట్టణంలో అతిసారం ప్రబలడంతో శుక్రవారం సద్దాంకాలనీలో ఇంటింటికి వెళ్లి బాధితులను విచారించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలన్నారు. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లు సవరణతో హక్కులకు భంగం



ఈ-మెయిల్ పేపర్లను చూపుతున్న ముస్లింలు

నంద్యాల(అర్బన్): వక్ఫ్ బిల్లుకు సవరణ జరిగితే ముస్లిం మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు తీవ్ర భంగం వాటిల్లుతుందని నంద్యాల అసెంబ్లీ ముస్లిం జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్ కరీం అన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈమెయిల్స్ పంపించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక షాదిక్‌నగర్ మసీదులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో రాజకీయ జోక్యం తగదని వాటి ఆస్తులతో కేంద్ర ప్రభుత్వానికి కలుగుతున్న ఇబ్బందులు ఏమిటో చెప్పాలన్నారు.వక్ఫ్ ఆస్తులు కాపాడలేని అసమర్థ ప్రభుత్వానికి చట్టసవరణ చేసే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ మహబూబ్‌బాషా, సభ్యులు సర్దార్‌ఖాన్, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.